క్లుప్తంగా

నూతన సాంకేతికత అధ్యాపకులకు అనుకూలం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహులు

పాణ్యం: నూతన విద్యా విధానం, సాంకేతిక పరిణామాలు అధ్యాపకులకు అనుకూలంగా ఉన్నాయని రాయలసీమ యూనివర్సిటీ మాజీ ఉప కులపతి, యూజీసీ హెచ్ఆర్‌డీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ నరసింహులు అన్నారు. ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్స్, ఈఈఈ విభాగాల ఆధ్వర్యంలో న్యూఢిల్లీ నేషనల్ ఇన్స్టూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్‌డ్యుకేషన్ సహకారంతో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 అండ్ 4.0 అంశంపై సదస్సు నిర్వహించారు. నూతన విద్యా విధానంతో రాబోవు తరాల వారికి మంచి ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంటుందన్నారు. అలాగే మరుతున్న సాంకేతిక విప్లవంతో పోటీ పడాలంటే తప్పకుండా నూతన విద్యావిధానం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీపీఏ మెనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ శ్రీనివాస, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డీన్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిణిగా మధుమతి

ఓర్వకల్లు: మండల వ్యవసాయాధికారిణిగా మధుమతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న బీవీజీ సుధాకర్ ఆదోనికి బదిలీకాగా, ఆయన స్థానంలో కర్నూలు భూసార పరీక్షా కేంద్రంలో పనిచేస్తున్న మధుమతిని నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, మండల ఎరువులు, పురుగు మందుల దుకాణదారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి, బొకేలు, స్వీట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎఈఓలు భాస్కర్, మధు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీల వాసులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని గోవర్ధన్ నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజా చైతన్య పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్, కార్యదర్శి క్రాంతికుమార్ విన్నవించారు. స్థాని క నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమ వారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే

- సంజయ్ గాంధీ నగర్‌లో కల్వర్టు నిర్మించాలని స్థానికులు ఉపేంద్ర, అఖిల్ విన్నవించారు.
- సంతోష్ నగర్, ఉమాన్ నగర్‌లో డ్రైనేజీ కాల్వలు, రహదారులు నిర్మించాలని సంతోష్ నగర్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి రంగయ్య అభ్యర్థించారు.
- కృష్ణా నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు మల్లికార్జున ఫిర్యాదు చేశారు.
- ఎర్రబురుజు వీధి, పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కాశపోగు ప్రకాష్ విన్నవించారు.

సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కొంతలపాడు సర్పంచు కుమ్మరి మధుకేశన్న అన్నారు. సోమవారం మండలంలోని ఎన్ కొంతలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలతో పాటు, బ్యాగ్‌లు, బెల్టులు, బూట్లు, యూనిఫాం విద్యార్థులకు అందజేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

ఇళ్ల స్థలాల కోసం కదం తొక్కిన సీపీఎం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం కదం తొక్కింది. సోమవారం జిల్లా కమిటీ పిలుపు మేరకు కర్నూలు నగరంలోని అన్ని సచివాలయాలు, కర్నూలు రూరల్, అర్బన్, కల్లూరు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆ పార్టీ శ్రేణులు నిరసనకు దిగాయి. ఈ సందర్భంగా నగర కార్యదర్శులు టి.రాముడు, రాజశేఖర్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా పట్టణాల్లో 2, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ఏడాదిలోపే ప్రభుత్వంపై వ్యతిరేకత

- విధ్వంసం, అరాచకం తప్పా.. అభివృద్ధి ఏదీ?
- ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుగా వైఎస్సార్‌సీపీ ఉంటుంది
- జగనన్న అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం బుక్‌లెట్ ఆవిష్కరణ


కూటమి ప్రభుత్వ ఏడాది విధ్వంస పాలనపై బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్

కర్నూలు (టౌన్): ఏడాదిలోనే చంద్రబాబు పాలనపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం స్థానిక ఏ.క్యాంపులోని కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అరాచకాలు, మోసాలను వివరిస్తూ రూపొందించిన 'జగనన్న అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ఏడాది పాలన అంతా చీకటి రోజులేనని విమర్శించారు. జగనన్న ఇచ్చిన పథకాల కంటే రెండింతలు ఇస్తామని అలివిగాని హామీలు ఇచ్చారన్నారు. అయితే ఏడాది పాలన పూర్తయినా హామీలు అమలు చేయడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ఆందోళనల నేపథ్యంలో విధిలేక 'తల్లికి వందనం' నిధులు మంజూరు చేశారని చెప్పారు. రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లికి వందనం పథకానికి అర్హులు కాగా 30 లక్షల మందికి సాయం అందించకుండా మోసం చేశారని మండిపడ్డారు. రెండో ఏడాది పాలన ప్రారంభమైనా రైతుకు భరోసా, క్రాప్ ఇన్సూరెన్స్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి సంవత్సరం 5 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 4 లక్షల ఉద్యోగాలు తొలగించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇస్తామని ఆశలు కల్పించి ఏడాది దాటినా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఇంగ్లిష్ మీడియం, బైజూస్ పాఠాలు, ట్యాబ్‌లు, నాడు – నేడు కింద పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దితే ఇప్పుడు వాటన్నింటినీ నిలిపివేసి విద్య వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యకే ప్రభుత్వం కొమ్ము కాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాస్తవాలు తెలియజేసేందుకే బుక్‌లెట్ ఆవిష్కరణ

మహిళలను, రైతులను, నిరుద్యోగులను, ఉద్యోగులను ఇలా.. ప్రతి ఒక్కరినీ మోసం చేసిన చంద్రబాబు పాలన, అరాచకం గురించి ప్రజలకు వివరించేందుకు జిల్లా కేంద్రంలో, నియోజవర్గ కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో, గ్రామ ప్రజలకు అందుబాటులోకి ఈ బుక్‌లెట్ తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో 40వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమ సింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, మండల ఉపాధ్యక్షులు నెహెమ్యా, అధికార ప్రతినిధి పోలకల్ ప్రభాకర్ రెడ్డి, కోడుమూరు ప్రచార విభాగం అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, కోడుమూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుజ్జన్న, రేమట సంపత్‌కుమార్, మండల కన్వీనర్ మోహన్‌బాబు, ఎంపీటీసీ గోపాల్, క్రిష్ణ, సురేష్, ఆదాం, మధు, క్రిష్ణ రెడ్డి, ఎదురూరు వెంకటేష్, బైరాపురం క్రిష్ణ, మధు శేఖర్, శివుడు, అయ్యస్వామి, అనిల్ బాష, మహేష్, మద్దిలేటి, రామరాజు, క్రిష్ణ, సలీం పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురిచేసేందుకే రెడ్‌బుక్ రాజ్యాంగం

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను సైతం వేధించడం, అక్రమ కేసులు నమోదు చేయడం, జైళ్లకు పంపడం దుర్మార్గమన్నారు. బాబు ఏడాది పాలన అంతా అరాచకం, వైఎస్సార్‌సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలను బెదిరించడం. అక్రమంగా కేసులు నమోదు చేయడంతోనే గడిచిపోయిందన్నారు. విధ్వంస పాలనను ప్రజలు క్షమించరని చెప్పారు. ప్రజలంతా కూటమి పాలనను గత ప్రభుత్వ పాలనతో పోల్చి చూస్తున్నారని బాబుకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో వైద్య రంగం తిరోగమనంలో కొనసాగుతుందని, ఆరోగ్యశ్రీ అటకెక్కిందన్నారు. జగనన్న ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకొస్తే వాటిని నడపడం చేతగాక ప్రైవేటు పరం చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కూటమి ఏడాది పాలనలోనే అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు ప్రజల తరఫున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

హామీలు అమలుచేసే వరకు పోరాటం


సీఎం చంద్రబాబు మోసాలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్వీ విజయ మనోహరి, తదితరులు

- సీఎం చంద్రబాబు మోసాలపై వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరణ
- కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ విజయ మనోహరి

కర్నూలు (టౌన్): కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ విజయ మనోహరి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక గిప్సన్ కాలనీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి స్వగృహంలో.. ఏడాది పాలనలో సీఎం చంద్రబాబు హామీల మోసాలు, అరాచకాలు, వెన్నుపోటును వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏడాది పాలన ముగిసినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం అంతులేని జాప్యం చేస్తోందన్నారు. అలవిగాని హామీలు ఇచ్చి లేని ఆశలు కల్పించి ఇప్పుడు చేతులెత్తేశారని విమర్శించారు. ఇప్పుడు 'తల్లికి వందనం' నిధులు మంజూరు చేశారంటే అది వైఎస్సార్‌సీపీ పోరాట ఫలితమే అన్నారు. జగనన్న కన్నా రెండింతలు పథకాలు అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ప్రజలను దగా చేశారన్నారు.

రాష్ట్రంలో హోం మంత్రి ఉన్నారా?

రాష్ట్రంలో హోం మంత్రి ఉన్నారా? పనిచేస్తున్నారా? అని ఎస్వీ విజయ మనోహరి ప్రశ్నించారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మానభంగాలు, రేప్‌లు, చిన్నారులపై అఘాయిత్యాలు, దాడులు, హత్యలు పెరిగిపోయాయన్నారు. వీటిని నిలువరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యమైందన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో హోంమంత్రి విఫలమయ్యారని విమర్శించారు. విచ్చలవిడిగా గంజాయి వినియోగం, నాటు సారా వల్లే రాష్ట్రంలో నేరాలు పెరిగిపోయాయన్నారు. వీటిని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు చివరకు జర్నలిస్టులను సైతం జైళ్లకు పంపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను బెదిరించాలని చూస్తే బెదిరే పరిస్థితులు లేవని తేల్చి చెప్పారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. ఏడాది పాలనలోనే ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, యాభై ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలందరికీ రూ.4 వేలు పెన్షన్, ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు మునెమ్మ, షేక్ యూనూస్ బాషా, ప్రధాన కార్యదర్శి షరీఫ్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి, భారతి, నగర అధ్యక్షురాలు మంగమ్మ, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను పట్టించుకోని పాలకులు


రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రైతు సంఘం నాయకులు

గడివేముల: నంద్యాల జిల్లాలోని పొగాకు రైతులను పాలకులు పట్టించుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రతినిధి బృందం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్రుడు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని చిందుకూరు గ్రామం సమీపంలోని జీపీఐ పొగాకు కంపెనీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, కొనుగోలు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ ఉన్నత అధికారులు ఉమామహేశ్వర రావుతో మాట్లాడి నత్తనడకన సాగుతున్న పొగాకు కొనుగోళ్లు, నాణ్యత పేరుతో ఒప్పందం కుదుర్చుకున్న రేటులో కోత విధించిన అంశం, నేటికీ రైతుల వద్ద అత్యధిక నిలువలు ఉండటం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నంద్యాల జిల్లాలోని మిడుతూరు మండలం వీపనగండ్ల, చౌట్కూరు గ్రామాలతో పాటు, పాములపాడు, ఆత్మకూరు, బనగానపల్లె మండలాల్లో జీపీఐ కంపెనీ కొనుగోలులో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని వారికి వివరించి వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి జిల్లాలో పొగాకు రైతాంగం కంపెనీల నిర్లక్ష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు ఏమాత్రం జోక్యం చేసుకోవడం లేదన్నారు. ఇది రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం స్పందించి రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జయ ప్రతాపరెడ్డి, తిమ్మారెడ్డి, ఏసన్న, రైతులు మౌలాలి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి


అధికారులకు వినతి పత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఓర్వకల్లు : మండలంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో యాజమాన్యం చేస్తున్న దోపిడీని అరికట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న, ఏపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగసురేంద్ర యాదవ్ తదితరులు సోమవారం ఎంఈఓ ఓంకార్ యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మండలంలోని ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి పాఠశాలల్లో యాజమాన్యం కేవలం ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు, బూట్లు, టై, బెల్టులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో మండల నాయకులు రాము, వెంకటేష్, మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

పాణ్యం : ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని అందరూ కలిసి విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అధిక సంఖ్యలో ప్రజలు యోగా దినోత్సవం రోజున యోగాలో పాల్గొనాలన్నారు. ఇందుకు అందరు సహకరించాలన్నారు. ఇప్పటికే యోగా వలన కలిగే అనేక ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించడం జరిగిందన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి


కోడుమూరులో తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


గూడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కోడుమూరు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు కూడా వర్తింపజేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి గఫూర్ మియ్యా డిమాండ్ చేశారు. గతంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పథకాలకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్‌మియ్యా మాట్లాడుతూ.. గతంలో కూటమి ప్రభుత్వ నాయకులు కూడా అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా చేస్తున్న శిబిరాలను సందర్శించి తాము అధికారంలోకొస్తే సంక్షేమ పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఇంతవరకు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా వర్తింపజేయలేదని విమర్శించారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని తక్షణమే అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ నాగరాజుకు అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి జీపీ వీరన్న, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు సూలమ్మ, సభ్యులు అరుణ, హైమావతి, రజియా, భాగ్యమ్మ, విజయ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ నెలకు రూ.12 వేల జీతం కూడా రాని అంగన్‌వాడీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతూ సంక్షేమ పథకాలను నిలిపేయడం దారుణమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అంగన్‌వాడీ వర్కర్లందరికీ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండలాధ్యక్షుడు గుంటప్ప, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు సుజాత, రత్నమ్మ, సునంద, నాగేంద్రమ్మ, చాంద్‌బీ, రామాంజనమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం ఇవ్వాలి

సి.బెళగల్: అంగన్‌వాడీ కార్మికులందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని మండల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మికి అర్జీ ఇచ్చారు. సీఐటీయూ డివిజన్ నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో మండల నాయకురాలు సరోజమ్మ, ఇందుమతి అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.


సి.బెళగల్‌లో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

ఆరుబయటే భోజనాలు


ఆరుబయట మధ్యాహ్నభోజనాలు చేస్తున్న విద్యార్థులు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని ఆరుబయటే చెట్ల కింద కూర్చొని చేస్తున్నారు. గాలి, దుమ్ము ధూళికి ఇబ్బందులు పడుతున్నారు.

పచ్చిక బయళ్లను పరిరక్షించండి


సి.బెళగల్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న గొర్రెల కాపర్లు

సి.బెళగల్: పచ్చిక బయళ్ల భూములు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించాలని సి.బెళగల్ మండల గొర్రెల కాపర్ల సంఘం నాయకులు తహసీల్దార్ వెంకటలక్ష్మిని కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెల కాపర్ల సంఘం నాయకులు, సభ్యులు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. సి.బెళగల్లోని ముక్కలగట్టు, మల్లప్పగట్టు, వడ్డెటని తిప్ప తదితర ప్రాంతాల్లో పచ్చిక బయళ్ల భూములు విస్తరించి ఉన్నాయని, వాటిని కొందరు ఆక్రమించుకుని పంటలను సాగు చేయడంతో పశువుల మేతకోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం పచ్చిక బయళ్లను పరిరక్షించాలని, ఆక్రమణకు గురికాకుండా చూడాలని సంఘం సభ్యులు గొర్ల మద్దిలేటి, పాండు, రామాంజనేయులు, ఎర్రమల, గుడ్ల వెంకటేష్, గజ్జి రాముడు, మద్దిలేటి, వెంకటేష్ తదితరులు కోరారు. గ్రామంలో విచారించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారితో అన్నారు.

హడావుడి చేశారు.. వదిలేశారు

- అధ్వానంగా పాణ్యం ఆర్టీసీ బస్టాండ్
- గతనెల 17న సీఎం వస్తున్నారంటూ హడావుడిగా పనులు ప్రారంభం
- కార్యక్రమం కర్నూలుకు మారడంతో పూర్తిచేయకుండా వదిలేసిన వైనం
- ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం


మరుగుదొడ్ల నిర్మాణం కోసం తీసిన గుంత


గతంలో ఉన్న మరుగుదొడ్లను తొలగించిన దృశ్యం

పాణ్యం: నియోజకవర్గ కేంద్రమైన పాణ్యంలోని ఆర్టీసీ బస్టాండ్ పూర్తి అధ్వానంగా మారింది. కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గతనెల 17న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు పాణ్యం వస్తున్నారని అధికారులు హడావిడి చేసి, బస్టాండ్‌లో పనులు ప్రారంభించారు. తీరా కార్యక్రమం కర్నూలుకు మారడంతో పనులు అలాగే వదిలేశారు.

ప్రమాదకరంగా గుంత

పాణ్యం బస్టాండ్‌లో అపరిశుభ్రంగా ఉండడంతో సీఎం రాక సందర్భంగా అధికారులు గ్రావెల్, కంకర వేయించి చదును చేయించారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణం కోసం పనులు ప్రారంభించేందుకు గుంతలు తవ్వారు. తీరా సీఎం ప్రోగ్రామ్ కర్నూలుకు మార్పు చేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకొని పనులన్నీ అలాగే వదిశారు. శిథిలావస్థలో ఉన్న చిన్న పాటి మరుగుదొడ్డిని కూల్చి వేసి ఓ బ్యానర్ తగిలించి వదిలేశారు. మరుగుదొడ్ల కోసం తీసిన గుంత అలాగే వదిలేయడంతో వర్షం నీటితో నిండిపోయింది. ఎవరైనా ప్రమాదవశాత్తు పడితే పడితే అంతే సంగతి.

బస్టాండ్‌లో సౌకర్యాలు కరువు

నిత్యం వందల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ప్రయాణికులకు కనీస సౌకర్యాలైన మంచినీరు, కుర్చీలు, మరుగుదొడ్లు లేవు. హైవే వారు నిర్మించిన చిన్నపాటి బస్టాండ్‌లో దాతలు ఇచ్చిన బెంచీలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా విరిగిపోయాయి. ప్రయాణికుల నుంచి సెస్ రూపంలో టికెట్‌పై కొంత మొత్తం వసూలు చేస్తున్న ఆర్టీసీ వారు సరైన వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కలెక్టర్ ఆదేశించినా..

పాణ్యం ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలు తాగునీటికి, మరుగుదొడ్ల కోసం వెతుకోవాల్సి వస్తోంది. ఇవేవీ అక్కడ లేకపోవడంతో చేప్పుకోలేని వేదన అనుభవిస్తున్నారు. బస్టాండ్ చుట్టూ షాపులు ఉండడంతో తాగేందుకు గుక్కెడు నీటి కోసం షాప్‌ల్లోకి వెళ్తున్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ కూడా పరిశీలించి, సౌకర్యాల కల్పనపై అధికారులను ఆదేశించారు. అయినా పనుల్లో మాత్రం ఎలాంటి పురోగతి లేదు.

వర్క్ ఆర్డర్ రాలేదు

పాణ్యంలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం టెండర్లు పిలిచాం. ఈ ప్రక్రియ పూర్తి చేశాం. కడప నుంచి వర్క్ ఆర్డర్లు రావాల్సి ఉంది. అనుమతులు రాగానే పనులు మొదలుపెడతాం. అలాగే బస్ షెల్టర్ కోసం రూ. 12లక్షలతో ప్రతిపాదనలు పంపించాం.

– వెంకటాచలం,
ఈఈ ఆర్టీసీ సివిల్ విభాగం, కర్నూలు

యోగాంధ్రను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ రాముడు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యోగా కార్యక్రమాలు నిర్వహించే వేదికల వద్ద తాగునీరు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీఓ సూచించారు. ఈఓఆర్డీ రాముడు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ సామగ్రి తరలింపును ఆపాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కర్నూలు(సెంట్రల్): వీబీసీ (పాత కార్బైడ్) ఫ్యాక్టరీ సామగ్రి అక్రమ తరలింపును అడ్డుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు బకాయి ఉన్న పీఎఫ్ సొమ్ము చెల్లించకుండా ఫ్యాక్టరీకి చెందిన వివిధ యంత్రాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తరలించరాదన్నారు. దాదాపు 25 సంవత్సరాల క్రితం 250 మంది కార్మికులతో ప్రారంభమైన పరిశ్రమను కొందరు కావాలనే దివాళా తీయించినట్లు చెప్పారు. వీబీసీ యాజమాన్యం చేతికి వచ్చిన తరువాత కార్మికులకు వేతనాలు సరిగా ఇవ్వకపోవడం, పీఎఫ్ చెల్లించకపోవడంతో మూత పడినట్లు చెప్పారు. రూ.500 కోట్ల విలువైన పరిశ్రమను వీబీసీ వారు వేరే యాజామాన్యానికి రూ.100 కోట్లకు అప్పగించారని, వారు కేవలం రూ.40 కోట్లు చెల్లించారన్నారు. ఇంతలోనే పరిశ్రమలోని విలువైన యంత్ర సామగ్రిని తరలించేందుకు కుట్ర చేస్తున్నట్లు చెప్పారు. కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్ వెంటనే చెల్లించాలని కోరారు.